క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

విశాఖ విద్య: ఎస్‌ఏడీ సెంటర్ సమీపంలోని గౌరీ నగర్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగంగా దీన్ని ఏర్పాటు చేశామన్నారు. స్పెషలిస్టు వైద్యులు శిబిరానికి వచ్చి వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఎస్‌ఏడీ సెంటర్ పరిసర కాలనీల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



దుకాణదారుడితో మాట్లాడుతున్న కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం బీఆర్‌టీఎస్ మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలపై కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ట్రాఫిక్ సీఐ ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసేవారికి, రోడ్డుపై ఇష్టానుసారం రాంగ్ పార్కింగ్ చేసేవారికి అవగాహన కల్పించారు. ఎల్లప్పుడూ రద్దీగా ఉండే మర్రిపాలెం మెయిన్ రోడ్డులో నిత్యం వేలాది మంది ప్రయాణాలు సాగిస్తారని, పాదచారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ డ్రైవ్ చేపట్టామని అన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

అగనంపూడి: చేయడానికి కూలి పని దొరక్క, మద్యానికి బానిసైన వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాలికి చెందిన ఎస్. నీలయ్య (45) భార్య జయలక్ష్మి ఇద్దరు కుమార్తెలతో కలిసి అగనంపూడి నిర్వాసితకాలనీ దొంకాడలో నివాసముంటున్నారు. పరవాడ ఫార్మాసిటీలో కూలి పనులు చేసుకుంటున్న నీలయ్య మద్యానికి బానిసగా మారాడు. దీంతో పాటు చేయడానికి పని దొరక్క మనస్తాపానికి గురై మద్యం మత్తులో సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరుపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు కాగా ఒక అమ్మాయికి వివాహం జరగ్గా, మరో కుమార్తె ఇంటర్ చదువుతోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాంటీన్లు తాత్కాలికంగా మూత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో ఉన్న పలు క్యాంటీన్లు తాత్కాలికంగా మూతపడనున్నాయి. ఎల్ఎంఎంఎం, వైర్ రాడ్ మిల్-1, ఎంఎంఎస్ఎం, బీఎఫ్, సింటర్ ప్లాంట్, టీపీపీ, కోక్‌ఓవెన్స్ 1,2 క్యాంటీన్లు మంగళవారం నుంచి పని చేయవు. అనివార్య కారణాల వల్ల క్యాంటీన్లు పని చేయవని.. ఉద్యోగులు సొంత ఏర్పాట్లు చేసుకోవాలని స్టీల్‌ప్లాంట్ (హెచ్‌ఆర్) క్యాంటీన్ సెక్షన్ అధికారులు విజ్ఞప్తి చేశారు.కాగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడం వల్లే క్యాంటీన్లు మూత పడే పరిస్థితి వచ్చిందని క్యాంటీన్ కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్. రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి పూర్తి చేసి 15 నుంచి 45 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9133242666 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలే.. శుభ కార్యాలకు వేదికలు!



ప్రాథమిక పాఠశాలకు అడ్డుగా వేసిన పెండల్స్



పాఠశాల ముఖద్వారంలో..

మల్కాపురం: పిల్లల చదువుకు ఉపయోగపడాల్సిన పాఠశాలలు వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలకు వేదికలవుతున్నాయి. ఫంక్షన్లు, ఇతర వేడుకలు పాఠశాల ప్రాంగణంలో జరిగితే విద్యార్థులకు ఇబ్బందులు ఉంటాయని తెలిసినా అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితి 58వ వార్డు గుల్లలపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠ

పట్టించుకోని అధికారులు

శాలలో ఉంది. పాఠశాలలో పిల్లలు ఆడుకొనేందుకు విశాలమైన మైదానం ఉంది. అయితే పెళ్లిళ్ల సీజన్ కావడంతో స్థానికంగా ఉన్న కొందరు పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలకు పాఠశాల ప్రాంగణాలను వేదికగా మార్చుకుంటున్నారు. కనీసం పాఠశాలలోకి విద్యార్థులు వెళ్లలేని విధంగా పెండల్స్,టెంట్‌లు,సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి చర్యల వల్ల ఇక్కడ చదువుకొనే పిల్లలకు ఇబ్బందిగా ఉంటుందని తెలిసినా ఎందుకో పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలను పిల్లలకు ఉపయోగపడే విధంగా మాత్రమే వినియోగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2 వినతులు అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, ఏసీపీ ఇన్‌చార్జి విజయకుమార్, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, మంచినీటి విభాగం ఈఈ సూరిశెట్టి శేఖర్, ఏఈ మోహన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా దసరా వేడుకలు



దుర్గాదేవి వేషధారణలో చిన్నారులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురంలోని భాష్యం పాఠశాలలో దసరా వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి చిత్ర పటాన్ని నెలకొల్పి సింధూరం,పసుపు,కుంకుమలతో పూజలు చేశారు. అమ్మవారి ముందు పిండివంటలు,స్వీట్లు పెట్టి విజయదశమి అందరికీ విజయాన్ని అందించాలని ప్రార్థించారు. పలు తరగతులు విద్యార్థులు దుర్గాదేవి,రాక్షసులు,సింహాలు ఇలా పలు వేషధారణలు వేసుకుని దుర్గాదేవి పాటలకు నృత్యాలు చేశారు. దసరా ఉత్సవాలు ఎందుకు నిర్వహిస్తారన్న దానిపై చేసిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గీతాలహరి, ప్రధానోపాధ్యాయురాలు హర్షిత తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ముహూర్తపు రాట

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక గల శానిటరీ కార్యాలయంలో దసరా పూజలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా సోమవారం ముహూర్తపు రాట వేశారు. ఈ సందర్భంగా నాయకుడు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఐక్యతతో దసరా వేడుకలు నిర్వహించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు.

అంతా కలిసి పని చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: పార్టీ బలోపేతం చేసి పశ్చిమలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడానికి అంతా కలిసి పని చేద్దామని, పార్టీలో ఏ ఒక్క కార్యకర్తకు కష్టం వచ్చినా తాను అండగా నిలుస్తానని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. సమన్వయకర్తగా నియమితులైన తర్వాత తొలిసారి సోమవారం తన నివాసంలో పలు వార్డుల కార్పొరేటర్లు,ముఖ్య నాయకులు,కార్యకర్తలతో కలిసి సమావేశం అయ్యారు. అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధన కోసం అంతా శ్రమిద్దామని, పాలకుల అవినీతిని ఎండగట్టడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాడుదామని పిలుపునిచ్చారు. పార్టీని నమ్ముకుని నడిచిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగే విధంగా చూస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.వి.సురేష్,బల్లా లక్ష్మణరావు,ముర్రు వాణి,గుండపు నాగేశ్వరరావు,ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనీల్,నాయకులు పత్నిరావు,శ్యామ్‌ప్రసాద్,కేబుల్ వాసు,పూండి మల్లేశ్వరరావు,గులిగిందల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జెడ్సీ బొడ్డేపల్లి రాము



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

కంచరపాలెం: జోనల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు సక్రమంగా మౌలిక సదుపాయాలు కల్పించగలమని జోన్-5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. జ్ఞానాపురంలోని జోన్–5 జోనల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జీవీఎంసీ 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు గల పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలో కొండవాలు, మురికివాడలు, పారిశ్రామిక ప్రాంతాలు అధికంగా ఉండడంతో అభివృద్ధి పనులు పూర్తికావడానికి జాప్యం జరుగుతోందన్నారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జోన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ వార్డులో సంబంధిత అధికారులతో వార్డు పర్యటన ఉంటుందన్నారు. పారిశుధ్య పనులు పబ్లిక్‌హెల్త్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సమస్యలను ఉపేక్షిస్తే ఉన్నత అధికారులు నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశ్రామిక ప్రాంతాల నుంచి రెవెన్యూ వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ ఆర్‌వోలకు జెడ్సీ సూచించారు. టౌన్‌ప్లానింగ్, విద్యుత్‌లైట్లు, మంచినీరు, కాలువలు, రోడ్లు వంటి సమస్యలపై ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతులు వస్తున్నాయన్నారు. అధికారులు వార్డుల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఉక్కు సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి



సత్యాగ్రహ దీక్ష కరపత్రం ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 2న నిర్వహించనున్న ఉక్కు సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని పోరాట కమిటీ నాయకులు కోరారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సెంట్రల్ స్టోర్స్ వద్ద సత్యాగ్రహ దీక్ష కరపత్రాన్ని విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వర కూ పోరాటం కొనసాగుతుందన్నారు. అదే విధంగా ప్లాంట్‌కు పూర్తి స్థాయి ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు ఇవ్వాలన్నారు.సత్యాగ్రహ దీక్షలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, జె.రామకృష్ణ, జెర్రిపోతుల ముత్యాలు, కామేశ్వరరావు, రామ్‌కుమార్, గణపతి రెడ్డి, శ్రీనివాస నాయుడు, సింహాద్రి పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి పరార్

ఆలస్యంగా వెలుగులోకి

అగనంపూడి: గంజాయి కేసులో నిందితుడు దువ్వాడ పోలీస్‌స్టేషన్ నుంచి పరారయ్యాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ముందస్తు సమాచారం మేరకు ఈ నెల 28న టాస్క్ ఫోర్స్ పోలీసులు దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న ఏఎస్ఆర్ జిల్లా పెదబయిలుకు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 21 కేజీల గంజాయితో పాట ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని దువ్వాడ పోలీసులకు అప్పగించారు. ఇద్దరిలో ఒకరు మైనర్ కాగా, మరో నిందితుడు అరడా శివకుమార్ చేతికి సంకెళ్లు వేశారు. శివకుమార్ సన్నంగా, పొట్టిగా ఉండడంతో 28వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత చేతికి వేసిన బేడీలు జారవిడుచుకొని తప్పించుకొని పారిపోయాడు. పోలీసులు అప్రమత్తమై నిందితుడిని వెంబడించినప్పటికీ ఫలితం దక్కలేదు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నప్పటికీ ఆచూకీ కాలేదు. కాగా మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ముఖ్యమంత్రి హోదాలో విష ప్రచారం తగదు

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికిన నాయకులు



విమానాశ్రయంలో మళ్ల విజయప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్లు, నాయకులు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడి లడ్డూపై విషప్రచారం చేయడం తగదని వైఎస్సార్ సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. పశ్చిమ సమన్వయకర్తగా నియమితులైన తర్వాత తొలిసారిగా విశాఖ వచ్చిన ఆయనకు నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గానికి మళ్లీ తనను సమన్వయకర్తగా నియమించినందు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. చిన్న చిన్న లోపాలను కూడా గుర్తించి అందరితో సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా పోరాటాలు చేస్తామని, ప్రజలకు మరింత చేరువవుతామన్నారు.

స్వామిని టచ్ చేసిన వారికి భంగపాటు తప్పదు

తిరుపతి వెంకన్న ఆలయాన్ని రాజకీయంగా వాడుకోవడానికి తప్పుడు ప్రచారం చేసిన వారికి భంగపాటు తప్పదన్నారు. తిరుమలేశుడి లడ్డూపై దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. నిజంగా ఆధారాలుంటే సీబీఐ విచారణను ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం చాలా దారుణమన్నారు. మళ్లకు స్వాగతం పలికిన వారిలో వార్డు కార్పొరేటర్లు ముర్రు వాణి నానాజీ, పీవీ సురేష్, కొణతాల సుధ, గుండపు నాగేశ్వరరావు బల్ల లక్ష్మణరావు, నాయకులు దొడ్డి కిరణ్, చుక్క ప్రసాదరెడ్డి, ఆడారి శ్రీనివాసరావు, గొర్లె అప్పల స్వామి నాయుడు, జి. కృష్ణ, శ్రీదేవి వర్మ, సత్యనారాయణ. సంపత్, దొడ్డి సతీష్,సత్యవతి, గంగరాజు, సత్తిబాబు ఉన్నారు.

రాళ్ల కుప్పలతో ఇబ్బందులు



రోడ్డుకు అడ్డంగా వేసిన రాళ్లు



రాత్రి వేళ ఇలా..

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి కొత్తపాలెం వెళ్లే రోడ్డులో రాళ్ల కుప్పలతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడతున్నారు. ఇక్కడి పనుల నిమిత్తం రాళ్లు వేశారు. అయితే ఈ రాళ్లు రోడ్డకు సగానికి పైగా విస్తరించి ఉండడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ దారిలో లైట్లు లేక పోవడంతో రాత్రి సమయంలో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. రాళ్లను రోడ్డు పక్కకు తొలగించాలని కోరుతున్నారు.

సెయిల్‌లో విలీనంతో ఉక్కు మనుగడ



మాట్లాడుతున్న ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సెయిల్‌లో విలీనం చేసి ఉక్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకుడు జె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం వద్ద 1327లుగా రిలే దీక్షలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ.పదివేల కోట్లు చెల్లించాలని కోరారు. ఉక్కు పరిరక్షణ కోసం మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. 2న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో పెద్ద ఎత్తున దీక్షలు నిర్వహిస్తామని, 3న రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. నాయకులు మసేన్‌రావు, కె.రాజబాబు, డి.దేముడు, సీతారామరాజు, ఆర్.ధనరాజు, రాజేశ్వరరావు, మోహన్‌కుమార్, కర్రి బాబూరావు, శ్రీనివాస్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎల్ఎంఎం, డబ్ల్యూఆర్ఎం, ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, ఎస్‌బీఎం ఉద్యోగులు పాల్గొన్నారు.